పదవ పడిలోకి 'మెట్రో' పరుగులు

● రెండో దశ ప్రాజెక్టు కోసం నగరవాసుల ఎదురుతెన్నులు



భూ ఉపరితలంలో మెట్రో పరుగులు

(ఆంధ్రజ్యోతి, చెన్నై)

'మెట్రో రైలు'.. 2015లో నగరవాసుల పెదాలపై ఈ పదం అదే పనిగా పలికింది. అప్పటివరకూ సబర్బన్ విద్యుత్ లోకల్ రైళ్లు, ఎంఆర్‌టీఎస్ రైళ్లను చూసిన ప్రజలకు ఈ పదం అబ్బురం కలిగించింది. భూ ఉపరితలంలోనూ, భూగర్భంలోనూ మెట్రోరైలు చడీచప్పుడూ లేకుండా తన ప్రయాణాన్ని ప్రారంభించింది. చెన్నైలో పలు దశలవారీగా కొనసాగిన మెట్రోరైలు తొలి ప్రాజెక్టు 2015 జూన్ 29న ప్రారంభమైంది. కోయంబేడు - పరంగిమలై (లిటిల్‌మౌంట్) నడుమ అప్పటి ముఖ్యమంత్రి జయలలిత ప్రారంభించారు. చెన్నై మెట్రోరైలు తొలి దశ ప్రాజెక్టును రూ.18,380 కోట్లతో చేపట్టారు. 45 కిలోమీటర్ల పొడవున 13 అప్పర్‌వే రైల్వేస్టేషన్లు, 18 అండర్ గ్రౌండ్ రైల్వేస్టేషన్లతో తొలి ప్రాజెక్టు అమలు చేశారు.

బ్లూవే, గ్రీన్‌వే...

సెంట్రల్ - కోయంబేడు - పరంగిమలైలో ఓ మార్గం, తిరువొత్తియూరు విమ్కోనగర్ - ఎయిర్‌పోర్టు వరకు మరో మార్గంలో ప్రస్తుతం మెట్రోరైళ్లు నడుస్తున్నాయి. ఆలందూరు మెట్రోరైల్వేస్టేషన్, సెంట్రల్ మెట్రోరైల్వేస్టేషన్ రెండంతస్తులు కలిగి ఉన్నాయి. ఈ రెండు రైల్వేస్టేషన్లలో ప్రయాణికులు బ్లూవే, గ్రీన్‌వే మార్గాల్లో ఏదైనా ఒకదానిని ఎంపిక చేసుకుని వెళ్తుంటారు. బ్లూ వే మార్గాన్ని వాషర్‌మెన్‌పేట నుంచి విమ్కోనగర్ వరకు 9.05 కిలోమీటర్ల దూరానికి పొడిగించారు. రైల్వే టెర్మినళ్లు బస్ టెర్మినల్, ఎయిర్‌పోర్టును తొలి దశ మెట్రోరైలు ప్రాజెక్టులోనే అనుసంధానం చేశారు. ఇలా దేశంలోనే బస్ టెర్మినళ్లు, రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం కలిగిన మొట్టమొదటి మెట్రో రైల్వే ప్రాజెక్టుగా చెన్నై పేరుగడించింది. అత్యంత ఆధునిక సదుపాయాలతో చెన్నై మెట్రోరైలు సేవలు నగరంలోని నాలుగు దిక్కులా ఉన్న కీలకమైన ప్రాంతాల దాకా కొనసాగుతున్నాయి.

మొదట్లో అనాసక్తి...

మెట్రోరైలు సేవలు ప్రారంభమైన తొలి దినాల్లో నగరవాసులు ఆ రైలులో ప్రయాణించడానికి ఆసక్తి చూపలేదు. ఏదో వింత వస్తువును చూసినట్లు చూశారు. చార్జీలు అధికంగా ఉండటం వల్ల తక్కువ సంఖ్యలోనే ప్రయాణించారు. తొలినాళ్లలో రోజుకు 20 వేల నుంచి 25 వేల మంది మాత్రామే ప్రయాణించారు. ఆ తర్వాత నగరవాసులు మెట్రోరైలుపై ఆసక్తి కనబరిచారు. మెట్రోరైల్వేస్టేషన్ల వద్దే బైకులు, స్కూటర్లు, కార్లు, వ్యాన్లు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం ఉండటంతో నగరవాసులు మెట్రో రైలు ప్రయాణంలో గల సౌలభ్యాన్ని గుర్తించారు. స్టేషన్లకు చేరువగా ఆటో స్టాండ్లు కూడా ఏర్పాటు చేశారు. దీనితో మెట్రోరైళ్లలో ప్రయాణించేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు రెండు లక్షలమంది దాకా ప్రయాణించారు. ప్రస్తుతం రోజుకు సగటున 3 లక్షల మంది దాకా ప్రయాణిస్తున్నారు. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో మెట్రోరైళ్లలో కూర్చునేందుకు సీట్లు లేక నిలుచుని ప్రయాణిస్తున్నారు. ట్రాఫిక్ రద్దీలో చిక్కకుండా నిర్దేశిత ప్రాంతానికి నిర్ణీత సమయంలో చేరటానికి మెట్రోరైలుకు మించిన మరో రవాణా సదుపాయం లేదని నగరవాసులు నొక్కివక్కాణిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, ఐటీ సంస్థల ఉద్యోగులు ఈ మెట్రో రైలు సేవలను అత్యధికంగా పొందుతున్నారనటం అతిశయోక్తి కాదు.

పదో యేట సేవలు...

చెన్నైలో మెట్రోరైలు ప్రారంభమై ఆదివారానికి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని, పదో ఏడాదిలోకి అడుగిడుతోంది. ఈ తొమ్మిదేళ్లలో మెట్రోరైళ్ల ప్రయాణించిన వారి సంఖ్య 29 కోట్లా 87 లక్షలమందికి పెరిగింది. ఇప్పటి వరకు సబర్బన్ విద్యుత్ లోకల్ రైళ్లు, ఎంఆర్‌టీఎస్ రైళ్ల సేవలను పొందిన నగరవాసులకు మెట్రోరైలు సేవలు వింతలు విశేషాలతో కూడిన మహాద్భుతంగా మారాయి. సొరంగ మార్గంలో ఉన్న మెట్రో రైల్వేస్టేషన్లు విస్మయం కలిగించాయి. భూమిలోపల మొదటి దిగువ దళంలో టికెట్లు తీసుకుని మెట్లమీదుగా కిందకు దిగి రెండో దిగువ దళంలో రెండు వైపులా అద్దాల తలుపులతో కూడిన రైలు మార్గాలు కనిపిస్తాయి. ప్లాట్‌ఫాం వద్ద రైలు నిలువగానే అద్దాల ప్రవేశద్వారం తెరచుకుంటుంది. ఆ తర్వాత రైలుకున్న అద్దాల ద్వారమూ తెరుచుకుంటుంది. నిమిషంలోపల ప్రయాణికులు రైలెక్కడం, దిగడం జరిగిపోతుంది. ఆ తర్వాత చల్లటి (ఏసీ సదుపాయంతో) వాతావరణంతో నిశ్శబ్ద ప్రయాణం. ఇక మెట్రోరైలు టికెట్ల జారీలో కొత్త పద్ధతులు ప్రవేశపెట్టారు. జర్నీ కార్డ్, సింగార చెన్నై కార్డు, క్యూఆర్ స్కాన్, పేటీఎం, వాట్సప్ వంటి ద్వారా టికెట్లు పొందితే ఛార్జీలో 20 శాతం రాయితీకూడా ఇస్తున్నారు. రద్దీ సమయాల్లో ప్రతి ఐదు నిమిషాలకొకటి చొప్పున మెట్రోరైళ్లు నడుపుతున్నారు. ప్రస్తుతం ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరుగుతుండటంతో త్వరలో అదనపు బోగీలను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్నారు.



అనుసంధానంగా...

రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు నగరంలోని 21 ప్రాంతాల్లో మహానగర రవాణా సంస్థ, సబర్బన్ విద్యుత్ లోకల్ రైళ్లు, ఎంఆర్‌టీఎస్ రైళ్ల సేవలతో అనుసంధానంగా ఉంటుంది. రెండో దశ ప్రాజెక్టు ద్వారా నగరంలోని కీలకమైన ప్రాంతాలన్నింటికీ ట్రాఫిక్ ఇబ్బందులకు తావులేని విధంగా సులువుగా వెళ్లగలుగుతారు. ఇదిలా ఉండగా మీనంబాక్కం ఎయిర్‌పోర్ట్ నుంచి కీలంబాక్కం బస్ టెర్మినల్ దాకా మెట్రోరైలు మొదటి దశ ప్రాజెక్టును విస్తరింపజేయనున్నారు. 15 కిలోమీటర్ల పొడవునా స్తంభాలతో కూడిన రైలు మార్గాన్ని నిర్మించనున్నారు ఈ పనులు పూర్తయితే దక్షిణాది జిల్లాల నుంచి వచ్చేవారంతా సులువగా నగరంలోని పలు ప్రాంతాలకు చేరుకోగలుగుతారు. అదే విధంగా విదేశాల నుంచి విమానంలో వచ్చే దక్షిణాది జిల్లా వాసులు మెట్రోరైలులో కీలంబాక్కం చేరుకుని అక్కడి నుండి ఎక్స్‌ప్రెస్ సర్వీసు బస్సుల్లో తమ గమ్యస్థానాలకు చేరుకోగలుగుతారు. ఏది ఏమైనప్పటికీ రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పూర్తయితే నగరంలో ముప్పావు శాతం ట్రాఫిక్ రద్దీ మాయమవుతుందని అధికారులు చెబుతున్నారు.

రెండో దశ ప్రాజెక్టు వివరాలు...

మాధవరం డెయిరీ నుంచి శిరుసేరి సిప్కాట్ వరకు 45.4 కిలోమీటర్ల దూరం వరకు 19 అప్పర్ సైడ్ రైల్వేస్టేషన్లు, 28 అండర్‌గ్రౌండ్ రైల్వేస్టేషన్లతో నిర్మిస్తున్నారు. ఇదే విధంగా మెరీనా బీచ్ లైట్‌హౌస్ నుంచి పూందమల్లి వరకు 26.1 కిలోమీటర్ల పొడవున 18 అప్పర్‌సైడ్ రైల్వేస్టేషన్లు, 9 అండర్‌గ్రౌండ్ రైల్వేస్టేషన్లతో నిర్మిస్తున్నారు. ఇక మాధవరం నుంచి షోళింగనల్లూరు వరకు 44.6 కిలోమీటర్ల పొడవునా 39 అప్పర్‌సైడ్ రైల్వేస్టేషన్లు, ఐదు అండర్‌గ్రౌండ్ రైల్వేస్టేషన్లతో నిర్మిస్తున్నారు.

రెండో దశ ప్రాజెక్టు...

నగరవాసులతో మెట్రోరైలు తొలి ప్రాజెక్టు మమేకమైన పరిస్థితిలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనులు రెండేళ్లుగా శరవేగంగా జరుగుతున్నాయి. రూ.63,246 కోట్లతో మూడు మార్గాల్లో ఈ ప్రాజెక్టులను అమలు చేయనున్నారు. రెండో దశ ప్రాజెక్టులో 3, 4, 5 రైలు మార్గాలను 116 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్నారు. ఈ మూడు మార్గాలు 118 రైల్వేస్టేషన్లు కలిగి ఉంటాయి. భారతదేశంలోనే మూడు మార్గాల మెట్రోరైలు మార్గం పనులు ఏకబిగిన చేపడుతున్న భారీ ప్రాజెక్టుగా పేరు సంపాదించుకుంది. ప్రస్తుతం ఈ మూడు మార్గాల రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. భూమి దిగువన 23 యంత్రాలతో సొరంగాలను తవ్వే పనులు, భూమిపైన సిమెంట్ స్తంభాల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో గిండి కత్తిపారా వద్ద మెట్రోరైలు 36 మీటర్ల ఎత్తు స్తంభాలపై 125 మీటర్ల వలయకారంలో నడువబోతున్నాయి. రెండో దశ ప్రాజెక్టులోని మూడు మార్గాల మెట్రోరైలు మార్గం నిర్మాణ పనులన్నీ 2028న పూర్తికానున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే 117 కిలోమీటర్ల మెట్రోరైలు మార్గంలో ప్రతిరోజూ 20 లక్షల మంది ప్రయాణించనున్నారని మెట్రో రైల్వే సంస్థ ఉన్నతాధికారులు చెబుతున్నారు. రెండో దశ మెట్రోరైలు సేవలు అందుబాటులోకి వచ్చాక సులువైన వేగవంతమైన రవాణా సదుపాయాలు కలిగిన రాజధాని నగరంగా చెన్నై పేరుగడిస్తుంది. అదే సమయంలో పారిశ్రామిక పెట్టుబడులు కూడా అధికమై అంతర్జాతీయ స్థాయి ఆర్థికనగరంగా చెన్నై మారబోతోంది.



రాజ్‌భవన్‌లో రాష్ట్ర మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహనరావు రచించిన 'గవర్నర్‌పేట్ టు గవర్నర్స్ హౌస్ - ఎ హిక్స్ ఒడిస్సీ' అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆవిష్కరించి రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ సి. రంగరాజన్‌కు అందజేస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి. పశ్చిమబెంగాల్ మాజీ గవర్నర్ ఎంకే నారాయణన్, ఏఐటీఎఫ్ అధ్యక్షుడు ఆచార్య సీఎంకే రెడ్డి కూడా ఉన్నారు.

సారా విక్రయిస్తే జీవిత ఖైదు



చట్టసవరణ బిల్లు దాఖలు చేసిన మంత్రి ముత్తుసామి

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సారా తయారు చేసి విక్రయిస్తే యావజ్జీవ కారాగారా శిక్ష, రూ.10లక్షల జరిమానా విధించేందుకు వీలు కల్పించేలా ఎక్సైజ్ చట్టసవరణ బిల్లును ఆ శాఖ మంత్రి ముత్తుసామి అసెంబ్లీలో శనివారం ఉదయం దాఖలు చేశారు. శాసనసభ సమావేశాలు ఈనెల 20న ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో అన్ని శాఖలకు సంబంధించిన ఆర్థిక పద్దుల బిల్లులు, చట్టసవరణలు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో చివరి రోజైన శనివారం ఉదయం కూడా పలు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు. ఆ మేరకు సారాను విక్రయించేవారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించేలా చట్టసవరణ బిల్లు దాఖలైంది. ఎక్సైజ్ చట్ట సవరణ బిల్లును ఆ శాఖ మంత్రి ముత్తుసామి ప్రతిపాదించారు. రాష్ట్ర ఎక్సైజ్ చట్టం 1937 చట్టాన్ని సవరించేలా ఈ బిల్లును రూపొందించినట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో కల్తీసారానూ పూర్తిగా నిరోధించేందుకుగాను దోషులకు కఠినంగా శిక్షించడానికి వీలుగా చట్ట సవరణలు చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ చట్ట సవరణ బిల్లును శాసనసభలో దాఖలు చేసిన తర్వాత ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పోలీసుశాఖ, అగ్నిమాపక శాఖలకు సంబంధించి ఆర్థిక పద్దుల సమర్పణ, ప్రతిపాదనలపై జరిగిన చర్చలకు సమాధానమిస్తూ ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో పుదుచ్చేరి సహా 40 నియోజకవర్గాల్లో గెలిచిన సంతోషంతో శాసనసభ సమావేశాలకు హాజరయ్యామని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల ముగింపు సందర్భంగా ఈ గెలుపును ఆయనకే అంకితమిచ్చామని స్టాలిన్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే సహా ప్రతిపక్ష పార్టీలన్నీ తమ ప్రభుత్వంపై ఎన్ని విమర్శలు, ఆరోపణలు చేసిన ఓటర్లు పట్టించుకోలేదని, తమ ద్రావిడ తరహా పాలనను మెచ్చుకుంటూ గెలిపించారని చెప్పారు. ఈ సమావేశాలను ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే పూర్తిగా బహిష్కరించడం తనకు ఆందోళన కలిగించిందన్నారు. ప్రధాన ప్రతిపక్షం కూడా సభలో పాల్గొని కళ్లకుర్చి కల్తీ సారా సంఘటన తదితర విషయాలపై అభిప్రాయాలను తెలిపి ఉంటే బాగుండేదన్నారు. కళ్లకుర్చి కల్తీ సారా ఘటనపై తాను చర్యలు చేపట్టానని, మృతుల కుటుంబీకులకు ఆర్థిక సాయం ప్రకటించానని, వైద్య బృందాలను పంపి బాధితులకు చికిత్సలు చేయించానని స్టాలిన్ వివరించారు.

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

ప్యారీస్, జూన్ 29: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 20న ప్రారంభమై శనివారం సాయంత్రం ముగిశాయి. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కొత్త పథకాలు, ప్రకటనలు, వివిధ శాఖల మంత్రులు ప్రవేశపెట్టిన బిల్లులు, ఎమ్మెల్యేల ప్రశ్నలు, మంత్రుల సమాధానాలు, చర్చలు సాఫీగా జరిగాయి. అదే సమయంలో కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటనను చేతుల్లోకి తీసుకున్న ప్రతి పక్షనేత ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు వరుసగా నాలుగు రోజులు సభలో ధర్నాలు, వాకౌట్లతో గలాభా సృష్టించారు. ప్రతిసారీ ప్రశ్నోత్తరాల సమయాన్ని వాయిదా వేసి కల్తీసారా దుర్ఘటనపై తమను మాట్లాడేందుకు అనుమతించాలని ఈపీఎస్ స్పీకర్‌పై ఒత్తిడి చేయడం... ప్రశ్నోత్తర సమయాన్ని రద్దు చేయడం కుదరదని తెలిసికూడా గలాభాకు పాల్పడటం న్యాయమేనా అని ఆయన ప్రశ్నించడం... ఆ తర్వాత వాకౌట్ చేయడం ఆనవాయితీగా మారింది. వాకౌట్ చేయని సందర్భంలో స్పీకర్ మార్షల్స్ చేత గెంటివేయించారు. ఇలా ఉద్రిక్తతలు సంచనాలకు కొదవలేకుండా అసెంబ్లీ సమావేశాలు సాగాయి. ఈ నేపథ్యంలో ఈనెల 26న అన్నాడీఎంకే సభ్యుల ప్రవర్తన శ్రుతిమించడంతో స్పీకర్ అప్పావు సమావేశాలకు రాకుండా ఉండేలా నిషేధం విధించారు. దీంతో 27వ తేదీ నుంచి శనివారం వరకు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు శాసనసభ దరిదాపులకు కూడా వెళ్లలేకపోయారు. ఇక చివరి రోజైన శనివారం పోలీసు శాఖకు సంబంధించి ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన రాయితీలపై సాగిన చర్చలో అధికారపార్టీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. సారా విక్రయించే వారిపై కఠిన శిక్ష పడే విధంగా చట్ట సవరణ బిల్లును కూడా చివరి రోజు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇక, రెవెన్యూ శాఖ, పరిశ్రమల శాఖ, ఆరోగ్య శాఖ, నగర పాలక నిర్వాహక శాఖ తదితర ప్రభుత్వ అన్ని శాఖలపై ప్రవేశపెట్టిన బిల్లులపై జరిగిన చర్చల అనంతరం కొత్త ప్రకటనలు కూడా విడుదలయ్యాయి. 1.15 కోట్ల మంది గృహిణులు ప్రతినెలా రూ.1,000 చొప్పున సాయం పొందుతున్న నేపథ్యంలో, మరో 1.40 లక్షల మందికి అందజేసే ప్రకటనను కూడా సీఎం సభలో ప్రకటించారు. ఈ రకంగా రాష్ట్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఆయా శాఖల మంత్రుల కొత్త ప్రకటనలు, విపక్షాల వాకౌట్, అన్నాడీఎంకే గెంటివేత తదితర సంచనాలతో సాగిన 9 రోజుల అసెంబ్లీ సమావేశాలు ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే సభ్యులు లేకుండానే తేది ప్రకటించకుండా వాయిదా వేస్తూ స్పీకర్ అప్పావు ప్రకటించారు.

పోలీసుశాఖకు స్టాలిన్ వరాల జల్లు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ చివరిరోజు సమావేశాల సందర్భంగా హోంశాఖను నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పోలీసుశాఖపై వరాల జల్లు కురిపించారు. 300 వాహనాలు కొనేందుకు రూ.31.50 కోట్లు, 25 వ్యాన్లకు రూ.5.25 కోట్లు, 15 పోలీసు బస్సుల కొనుగోలుకు రూ.4.5 కోట్లు, 500 బైకుల కొనుగోలుకు రూ.5.50 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. విధి నిర్వహణలో మృతి చెందితే ప్రభుత్వమిచ్చే పరిహారాన్ని రూ.25లక్షల నుంచి రూ.30లక్షలకు పెంచినట్లు, అవిటితనానికి గురైతే ఇచ్చే సహాయాన్ని రూ.12 లక్షల నుంచి రూ.15లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఇక తాంబరం పరిధిలోని మణిమంగళం పోలీసుస్టేషన్‌ను విభజించి పడప్పైలో కొత్త పోలీసుస్టేషన్‌ను, మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం పోలీసుస్టేషన్‌ను విభజించి తిరుప్పరంకుండ్రం ఆలయానికంటూ ప్రత్యేక



శాసనసభలో పోలీసుశాఖను పటిష్టపరిచే దిశగా భారీగా నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు వరుసగా నిలిచి ధన్యవాదాలు తెలియజేస్తున్న పోలీసు అధికారులు

పాత భవనాల్లోని పోలీసుస్టేషన్లకు కొత్త భవనాలు నిర్మించి ఇస్తామని, శాఖను పటిష్ఠ పరిచేందుకు కొత్త పోస్టులను రూపొందిస్తామని, వాహనాలు, పరికరాల కొనుగోలుకు భారీగా నిధులు కేటాయిస్తామని తెలిపారు. పోలీసులు శాఖకు సంబంధించి ఆర్థిక పద్దులను ఆయన ప్రవేశపెడుతూ ... పోలీసుస్టేషన్లు, పోలీసుల క్వార్టర్స్ తదితర భవనాల మరమ్మతులు, నిర్వహణ పనులకు ప్రభుత్వం కేటాయించే నిధిని రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్లకు పెంచనున్నట్లు తెలిపారు. కొత్తగా పోలీసుస్టేషన్‌ను, తిరువణ్ణామలై జిల్లా ఆదమంగళపుదూరులో కొత్త పోలీసుస్టేషన్‌ను, చెన్నై కొళత్తూరు సర్కిల్‌లో కొత్తగా మహిళా పోలీసుస్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కీలంబాక్కం, ఏర్కాడుల్లో కొత్తగా ట్రాఫిక్ పోలీసుస్టేషన్లను ప్రారంభించి, ఆవడి పోలీసు కమిషనరేట్ పరిధిలో కొత్తగా పొన్నేరి సర్కిల్‌ను విలీనం చేస్తామన్నారు. ఇక కొత్వాల్‌చావిడి పోలీసుస్టేషన్‌కు, కాంచీపురం జిల్లా విష్ణుకాంచి పోలీసుస్టేషన్‌కు, దిండుగల్ జిల్లా కన్నివాడి పోలీసుస్టేషన్‌కు, తిరువారూరు జిల్లా కూత్తనల్లూరు పోలీసుస్టేషన్‌కు కొత్త భవనాలు నిర్మించనున్నట్లు వివరించారు.



పేలుడులో తునాతునకలైన గడులు

బాణసంచా కర్మాగారంలో పేలుడు

● నలుగురు కార్మికుల దుర్మరణం
● 3 గదులు నేలమట్టం



ప్రాణాలు కోల్పోయిన కార్మికులు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని బాణసంచా కర్మాగారంలో శనివారం ఉదయం జరిగిన పేలుడులో నలుగురు కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో ఆ కర్మాగారంలోని మూడు గదులు ధ్వంసమయ్యాయి. పందువారపట్టియల్ ప్రాంతానికి చెందిన సహాదేవన్ అనే వ్యక్తి రెవెన్యూ అధికారుల అనుమతితో నడుపుతున్న ఆ కార్మాగారంలో పదికి పైగా గదులు ఉన్నాయి. రోజూ సుమారు 30 మంది కార్మికులు పనిచేస్తుంటారు. ఆ మేరకు శనివారం ఉదయం పది మంది కార్మికులు ఆ కర్మాగారానికి వెళ్లి టపాకాయాల తయారీకి అవసరమైన రసాయన పొడులను కలుపుతుండగా ఉన్నట్టుండి మంటలు చెలరేగి ఓ గదిలో భద్రపరచిన టపాకాయలపై పడ్డాయి. దీనితో టపాకాయలకు నిప్పంటుకుని పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ పేలుడులో మూడుగదులు నేలమట్టమయ్యాయి. ఈ దుర్ఘటనలో నలుగురు కార్మికులు తీవ్రవంగా గాయపడి ఆ ప్రాంతంలోనే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అగ్నిమాపక దళం సభ్యులు గంటల తరబడి పోరాడి మంటలను ఆర్పివేశారు. ధ్వంసమైన మూడు గదుల శిథిలాల దిగువనున్న నలుగురి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆ తర్వాత పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో మృతులను అచ్చుకుళం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (45), నడుశూరంగుడికి చెందిన మారిసామి (40), వెంబకోట్టైకి చెందిన సెల్వకుమార్ (35), మోహన్ (30)గా గుర్తించారు.

సీఎం స్టాలిన్ సంతాపం...

విరుదునగర్ జిల్లా సాత్తూరు వద్ద బాణాసంచా కర్మాగారంలో సంభవించిన పేలుడులో నలుగురు కార్మికులు దుర్మరణం చెందటం పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆ మేరకు ఓ ప్రకటన జారీ చేస్తూ మృతుల కుటుంబాలకు తలా రూ.3లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక దళం

సమాచార దర్శిని

సెప్టెంబరు 30 వరకు ఊటీ ఈ-పాస్ విధానం

ఐసిఎఫ్, జూన్ 29: ఊటీ, కొడైకెనాల్ వెళ్లే పర్యాటకులకు ఈ-పాస్ అందజేసే విధానాన్ని సెప్టెంబరు 30వ తేది వరకు పొడిగిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వన్యప్రాణులు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కేసులను న్యాయమూర్తులు సతీష్‌కుమార్, భరత్ చక్రవర్తితో కూడిన ప్రత్యేక బెంచ్ విచారిస్తోంది. గత ఏప్రిల్ నుంచి ఊటీ, కొడైకెనాల్‌కు ఎన్ని వాహనాలు వెళ్లవచ్చు అన్న దానికి సంబంధించి ఐఐటీ, ఐఐఎం విద్యాసంస్థలు పరిశీలిస్తున్నాయి. నివేదిక వచ్చే వరకు ఈ ప్రాంతాలకు ఈ-పాస్ ఉన్న వాహనాలు మాత్రమే అనుమతించాలని దిండుగల్, నీలగిరి జిల్లా కలెక్టర్లకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానం మే 7 నుంచి ఈ నెల 30వ తేది వరకు అమలులో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ నేపథ్యంలో, ఈ గడువు సెప్టెంబరు 30వ తేది వరకు పొడిగిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

కొత్త రైల్వే టైం టేబుల్ వాయిదా

ఐసిఎఫ్, జూన్ 29: కొత్త టైంటేబుల్‌ను వచ్చే ఏడాది జనవరి 1న విడుదల చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యేటా జూలై, ఆగస్టులో ఎక్స్‌ప్రెస్, సబర్బన్ రైళ్ల కొత్త టైం టేబుల్‌ను రైల్వే శాఖ విడుదల చేస్తోంది. ఈ టైంటేబుల్‌లో ఆయా మండలాల్లో కొత్త రైలు సర్వీసులు, అదనపు హాల్ట్‌లు తదితర వివరాలు ఉంటాయి. అనివార్య కారణాలతో జూలైలో విడుదల కావాల్సిన టైం టేబుల్ జనవరిలో విడుదల చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

వెటర్నరీ కోర్సులకు 17,497 మంది దరఖాస్తు

ఐసిఎఫ్, జూన్ 29: వెటర్నరీ కోర్సుల్లో చేరేందుకు 17,497 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తమిళనాడు వెటర్నరీ సైన్స్ విశ్వవిద్యాలయం తెలిపింది. ఈ వర్శిటీ ఆధ్వర్యంలో ఉన్న కళాశాలల్లో బీవీఎస్సీ-ఏహెచ్, బీటెక్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 28న ముగిసింది. వెటర్నరీ కోర్సులకు 14,497 మంది, బీటెక్ కోర్సుకు 3,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 800 సీట్లు మాత్రమే ఉన్నాయి. ప్రవాస భారతీయులు జూలై 5వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో ఎంబీఏ కోర్సు

ఐసిఎఫ్, జూన్ 29: చెన్నై ఐఐటీలో 'మారీటైం డిజిటల్ అండ్ సప్లయ్ చేంజ్' అనే ఆన్‌లైన్ ఎంబీఏ కోర్సు ప్రవేశపెట్టారు. ఈ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ ntcpwc.iitm.ac.in/dmscmba/లో ప్రారంభమైంది. డిగ్రీ పూర్తిచేసిన వారు ఆగస్టు 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష మార్కుల ఆధారంగా అడ్మిషన్లు జరుగుతాయని ఐఐటీ డైరెక్టర్ కామకోటి తెలిపారు.

జూలైలోనూ రేషన్‌లో కందిపప్పు

ఐసిఎఫ్, జూన్ 29 : కందిపప్పు, పామాయిల్‌ను జూన్‌లో పొందని వారు వాటిని జూలైలో తీసుకోవచ్చని ఆహార సరఫరా శాఖ ప్రకటించింది. రేషన్ దుకాణాల్లో ప్రతి నెలా కిలో కందిపప్పు రూ.30, లీటరు పామాయిల్ రూ.25కు అందజేస్తున్నారు. ఈ నెల వాటిని పొందని వారు జూలై నెలాఖరు వరకు పొందవచ్చని అధికారులు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ శాఖ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 29: కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ ద్వారా వివిధ శాఖల్లో 4,887 పోస్టులు, కేంద్ర మత్తుపదార్థాల నిరోధక విభాగం, కేంద్ర పరోక్ష పన్నులు, సుంకపు బోర్డులో 3,439 పోస్టులు, హవాల్దార్ పోస్టులు అని మొత్తం 8,326 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఔత్సాహికులు జూలై 31వ తేది వరకు ssc.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చు.

3 నుంచి ఒండ్రు మట్టి రవాణాకు అనుమతి

ఐసిఎఫ్, జూన్ 29: ఒండ్రు మట్టి తీసుకెళ్లేందుకు జూలై 3వ తేది నుంచి అనుమతిస్తూ జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ ఉత్తర్వులు జారీ చేశారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో ఉన్న 5 వేలకు పైగా జలాశయాలు, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్న 6,700కు పైగా నీటి వివరాలను వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. రైతులు తమ గ్రామానికి సమీపంలో ఉన్న జలాశయాలు మాత్రమే కాకుండా తమ తాలూకా పరిధిలోని జలవనరుల్లోనూ ఒండ్రు మట్టి తీసుకెళ్లొచ్చని తెలిపారు. దీని ద్వారా చెరువుల్లో పూడిక తీయడంతో పాటు భూగర్భ జలమట్టాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జూలై 3వ తేది నుంచి రైతులు ఈ-సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, అనుమతి పొంది ఒండ్రు మట్టి తీసుకెళ్లొచ్చని తెలిపారు.

గవర్నర్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూన్ 29: గవర్నర్ పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. సాంఘీక సంక్షేమం, పర్యావరణ భద్రత వంటి వాటికి కృషిచేసిన వారికి, స్వచ్ఛంద సంస్థలకు గవర్నర్ పురస్కారాలను అందజేస్తున్నారు. అర్హులైన వారు ఆగస్టు 9వ తేదిలోపు https://tnrajbhavan.gov.in అనే వెబ్‌సైట్‌లో ఉన్న ఫారాన్ని పూర్తిచేసి, awardsrajbhavantamilnadu@gmail.com అనే ఈ-మెయిల్ చిరునామాకు పంపించాలి.

ఆగస్టులో రెండో విడత మొదటి రైలు

ఐసిఎఫ్, జూన్ 29: నగరంలో రెండవ విడత మెట్రోరైలు పథకంలో మొదటి రైలును ఆగస్టు నాటికి సిద్ధమవుతున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. నగరంలో జరుగుతున్న రెండో విడత మెట్రో రైలు పథకానికి ఆంధ్ర రాష్ట్రం శ్రీ సిటీలో ఉన్న అల్స్‌టోమ్ కర్మాగారంలో రైలు పెట్టెల తయారీ పనులు జరుగుతున్నాయి. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... నగరంలో రెండవ విడత మెట్రోరైలు పథకం పనులు 2027లోపు పూర్తవుతాయని తెలిపారు. మూడు పెట్టెలు కలిగిన మొదటి మెట్రోరైలు ఆగస్టులో వస్తుందని, సెప్టెంబరులో మరో మూడు రైళ్లు వస్తాయని తెలిపారు. అనంతరం ట్రయల్ రన్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి సైనికుల ఎంపిక

ఐసిఎఫ్, జూన్ 29: తూత్తుకుడి తరువై మైదానంలో జూలై 1 నుంచి 5వ తేది వరకు సైనికుల ఎంపిక జరుగనుంది. ఇదివరకే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న తిరుచ్చి, కరూర్, పుదుచ్చేరి రాష్ట్రం కారైక్కాల్ సహా 17 జిల్లాలకు చెందిన వారికి ఈ ఎంపికలో పాల్గొనేందుకు కాల్ లెటర్లు పంపించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని అధికారులు తెలిపారు.

మరో పది రోజుల్లో ఎలిఫెంట్ గేట్ ఫ్లైఓవర్ ప్రారంభం

● కార్పొరేషన్ కమిషనర్ ప్రకటన

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌ను ఆనుకుని ఉన్న వాల్‌టాక్స్ రోడ్డు ఎలిఫెంట్‌గేట్ నుంచి చూళై వెళ్లే మార్గంలో నిర్మించిన కొత్త ఫ్లైఓవర్‌ను పది రోజుల్లో ప్రారంభించనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ రాధాకృష్ణన్ తెలిపారు. కోడంబాక్కం జోన్ సైదాపేట అబిద్ కాలనీలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైద్య శిబిరం ఏర్పాట్లను శనివారం ఉదయం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెంట్రల్ రైల్వేస్టేషన్ బేసిన్ బ్రిడ్జి రైల్వేస్టేషన్ల నడుమ ఆంగ్లేయుల కాలంలో 1933లో నిర్మించిన పాత ఫ్లైఓవర్ శిథిలావస్థలకు చేరుకోవడంతో దాన్ని కూల్చివేసి కొత్త ఫ్లైవర్ నిర్మాణాన్ని రైల్వే శాఖ, కార్పొరేషన్ సంయుక్తంగా చేపట్టినట్లు చెప్పారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి దక్షిణ రైల్వే రూ.49 కోట్లు, కార్పొరేషన్ 30.76 కోట్ల చొప్పున నిధులు కేటాయించాయన్నారు. కరోనా లాక్‌డౌన్ అమలులో ఉన్న 2020లో పాత ఫ్లైఓవర్‌ను కూల్చివేసినట్లు చెప్పారు. ఆ తర్వాత 2020 ఆగస్టులో 520 మీటర్ల పొడవు, 20.1 మీటర్ల వెడల్పుతో కొత్త ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. రైలుపట్టాలు మీదుగా ఈ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడని రీతిలో కొనసాగిస్తూ వచ్చామన్నారు. మార్చిలో ఈ టూవే ఫ్లైఓవర్‌లో ఓ మార్గాన్ని మాత్రమే ప్రారంభించామని, ప్రస్తుతం రెండో వైపు ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, పది రోజుల్లో ఆ ఫ్లైఓవర్‌ను ప్రారంభించనున్నామని కమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు.



సైదాపేటలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళుతున్న చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ రాధాకృష్ణన్

ఎన్ఎల్‌సీ టౌన్‌షిప్‌లో పారిశుధ్య కార్యక్రమాలు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పఖ్వాడాలో భాగంగా సంస్థ సీఎండీ ప్రసన్నకుమార్ మోటుపల్లి పిలుపు మేరకు నైవేలి టౌన్‌షిప్, చెన్నైలోని ప్రాంతీయ కార్యాలయం, అన్ని ప్రాజెక్టుల కార్యాలయాల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. గనుల విభాగం డాక్టర్ సురేష్ చంద్ర సుమన్, మానవ వనరుల విభాగ డైరెక్టర్ సమీర్ స్వరూప్ కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చెన్నైలోని ప్రాంతీయ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమాల్లో ఫైనాన్స్ విభాగ డైరెక్టర్ ప్రసన్న కుమార్ ఆచార్య నాయకత్వంలో సీసీ అండ్ సీఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ప్రభుకిషోర్, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ టీజీ శ్రీనివాసన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు హెయిర్ కటింగ్

ప్యారీస్, జూన్ 29: అపరిశుభ్రంగా చింపిరి జుట్టుతో పాఠశాలకు హాజరవుతున్న విద్యార్థులకు సాఫీగా కటింగ్ చేయాలన్న తల్లిదండ్రుల కోరికను పాఠశాల విద్యాశాఖ నెరవేర్చింది. ఈ మేరకు చెంగల్పట్టు అరింజర్ అన్నా ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో చదువుకుంటున్న 67 మంది విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలోనే సాఫీగా తలవెంట్రుకలు కత్తిరించారు. ఇందుకోసం ఇద్దరు క్షురకులను కూడా ఏర్పాటు చేసి 9, 10, 11, 12 చదువుకుంటున్న 67 మంది విద్యార్థులకు కటింగ్ చేశారు. ఈ నేపథ్యంలో, ఓ విద్యార్థి, పాఠశాలలో తలవెంట్రుకలు కత్తిరించవద్దని, కావాలంటే టీసీ ఇస్తే వేరే పాఠశాలలో చేరుతానని ఆగ్రహం వ్యక్తం చేశాడు. మరోవైపు తలవెంట్రుకలు కత్తిరిస్తారన్న విషయం తెలుసుకున్న కొందరు విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఛాయలకు కూడా వెళ్లలేదు. అయినా వారికి కూడా తలవెంట్రుకలు కత్తిరిస్తామని ప్రధానోపాధ్యాయుడు మాయవన్ పేర్కొన్నారు.



విద్యార్థులకు వెంట్రుకలు కత్తిరిస్తున్న క్షురకులు

విద్యార్థులకు నాసిరకమైన సైకిళ్ల పంపిణీ

● కాంగ్రెస్ నేత పి.చిదంబరం ఆరోపణ

ప్యారీస్, జూన్ 29: విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం నాసిరకమైన సైకిళ్ల పంపిణీ చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఆరోపించారు. ఆయన శనివారం తన ఎక్స్ పేజీలో... రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న సైకిళ్లు నాసిరకమైనవని, అందువల్ల వాటిని విక్రయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఇలాంటి సైకిళ్లను తయారుచేస్తున్న సంస్థలతో అధికారులు చర్చించి, వాటిని తిరిగి అప్పగించాలన్నారు. కనీసం ఈ విద్యా సంవత్సరంలో నాణ్యమైన సైకిళ్లను పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చిదంబరం అభిప్రాయం వ్యక్తం చేశారు.

మురుగునీటి అక్రమ కనెక్షన్లు ఇస్తే ఆర్నెళ్లు జైలు

ఐసిఎఫ్, జూన్ 29: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ మురుగునీటి కనెక్షన్లు ఇచ్చే వారికి ఆరు నెలలు జైలుశిక్షతోపాటూ జరిమానా విధించనున్నట్లు చెన్నై మెట్రోవాటర్ బోర్డు హెచ్చరించింది. నగరంలో వర్షపు నీటి కాలువలకు కొందరు మురుగునీటి కనెక్షన్లు ఇస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారికి అప్పుడప్పుడూ జరిమానా కూడా విధిస్తున్నారు. అయినప్పటికీ, పలు చోట్ల అక్రమ కనెక్షన్లు ఇస్తుండడాన్ని మానుకోవడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని నిబంధనలు ఉల్లంఘించే వారికి రూ.10,000 జరిమానా, ఆరు నెలల వరకు జైలుశిక్ష విధించనున్నట్లు హెచ్చరించారు.

సైదాపేటలో అంటువ్యాధితో బాలుడి మృతి

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సైదాపేట అబిత్‌కాలనీలో ఓ బాలుడు అంటు వ్యాధికి గురై ఆసుపత్రిలో చికిత్స ఫలించకమృతి చెందాడు. దీంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారంతా ఆందోళన చెందుతున్నారు. ఉత్తరాది రాష్ట్రానికి చెందిన రాజేష్‌కుమార్ కుమారుడైన యువరాజ్ (11) కొద్ది రోజులకు ముందు అంటు వ్యాధికి గురై తీవ్ర అస్వస్థత చెందాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స ఫలించక మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేషన్ ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆ ప్రాంతంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులను పంపిణీ చేస్తున్నారు. ఆ ప్రాంతమంతటా బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య పనులు కూడా చేపడుతున్నారు. ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారంతా కాచి చల్లార్చిన నీటిని తాగాలని అధికారులు పేర్కొన్నారు. ఇక వైద్యశిబిరంలో 12యేళ్లలోపువారికి మాత్రలను పంపిణీ చేస్తున్నారు. ఇదిలా ఉండగా అంటువ్యాధితో బాలుడు మృతి చెందిన సంఘటనపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారులు నగరంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్‌కు లుకౌట్ నోటీసు

ప్యారీస్, జూన్ 29: భూకబ్జా వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్ విదేశాలకు తప్పించుకుపోకుండా అడ్డుకొనేలా దేశంలోని విమానాశ్రయాలకు లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో కరూర్ ఎమ్మెల్యేగా గెలిచిన ఎమ్మార్ విజయభాస్కర్‌కు అప్పటి ముఖ్యమంత్రి జయలలిత, రవాణా శాఖ మంత్రి బాధ్యతలు కట్టబెట్టారు. మంత్రి హోదాలో ఆయన ఆదాయానికి మించి ఆస్తులు వెనకేసుకున్నారని, జీపీఎస్ పరికరాల కొనుగోలులో అవినీతికి పాల్పడ్డారన్న ఫిర్యాదులపై విచారణ పెండింగ్‌లో ఉంది. ఈ నేపథ్యంలో, సుమారు రూ.100 కోట్ల భూములు కబ్జా చేశారని విజయభాస్కర్‌పై కరూర్‌కు చెందిన ప్రకాష్ అనే వ్యాపారవేత్త ఆరోపించారు. ఈ మోసంపై మేలకరూర్ సబ్ రిజిస్ట్రార్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ కూడా కరూర్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీటి ఆధారంగా శోభన, యువరాజ్, ప్రవీణ్ తదితర ఏడుగురిపై 8 సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఇందులో, తనను కూడా చేరుస్తారన్న అనుమానంతో విజయభాస్కర్ ఈ నెల 12న కరూర్ జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో ముందస్తు బెయిలు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ తిరస్కరణకు గురికావడంతో పోలీసులు తనను ఏ నిమిషంలోనైనా అరెస్ట్ చేస్తారని భావించిన ఆయన అజ్ఞాతంలోకి జారుకున్నారు. దీంతో ఆయన్ను అరెస్ట్ చేసేందుకు ఏడు పోలీసు బృందాలు రంగంలో దిగాయి. ఈ నేపథ్యంలో, అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన విదేశాలకు వెళ్లకుండా లుకౌట్ నోటీసులు జారీ అయినట్లు సమాచారం

డీఎంకే హయంలోనూ కామరాజర్ పాలనే

● ఎంపీ విజయ్‌వసంత్

ప్యారీస్, జూన్ 29: ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్న డీఎంకే పాలన కూడా కామరాజర్ పాలనతో పోల్చుకోవచ్చునని కన్నియాకుమారి కాంగ్రెస్ ఎంపీ విజయ్‌వసంత్ పేర్కొన్నారు. కన్నియాకుమారి ఎంపీగా రెండో సారి బాధ్యతలు చేపట్టిన విజయ్‌వసంత్ స్థానిక టి.నగర్‌లో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ నివాసంలో ఉన్న ఆయన విగ్రహానికి శనివారం నివాళి అర్పించారు. అనంతరం సైదాపేట చిన్నమలై జంక్షన్‌లో ఉన్న దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి, గిండిలో ఉన్న కామరాజర్ స్మారక భవనంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దలు తమిళనాడులో కూడా పార్టీకి బలపరచాలన్న ఉద్దేశంతో పార్లమెంటు సమావేశాల్లో సెంగోల్‌ను అస్త్రంగా తీసుకొని రాజకీయాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఒకే విద్యార్థి ఉన్న పాఠశాల మూసివేత

ఐసిఎఫ్, జూన్ 29: రామనాథపురం జిల్లా తిరువాడానైలో ఒకే విద్యార్థి చదువుతున్న పాఠశాలను అధికారులు మూసివేశారు. తిరువాడానై సమీపంలోని కడంబూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని, ఇద్దరు ఉపాధ్యాయులతో పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో, ఓ ఉపాధ్యాయుడు వేరు పాఠశాలకు బదిలీ అయ్యారు. అదనంగా విద్యార్థులను చేర్చుకొనేందుకు విద్యాశాఖ అధికారులు ఎంత ప్రయత్నించినా, ఆ పాఠశాలలో చేరేందుకు ఎవరూ ముందుకు రాలేదు. మరో దారిలేక పాఠశాలను గురువారం అధికారులు మూసివేశారు. అక్కడ చదువుతున్న విద్యార్థినిని గురువిలాంకుడి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, అక్కడున్న టీచర్‌ను ముల్లిముని ప్రభుత్వ పాఠశాలకు బదిలీచేశారు.

కల్లు దుకాణాల ప్రారంభంపై ప్రభుత్వం పరిశీలించాలి

● కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్

ప్యారీస్, జూన్ 29: రాష్ట్రంలో కల్లు దుకాణాలు ప్రారంభించడంపై రాష్ట్రప్రభుత్వం పరిశీలించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ విజ్ఞప్తి చేశారు. సచివాలయ ప్రాంగణంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కల్లు దుకాణాలు ప్రారంభించడం ద్వారా ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు గీత కార్మికులకు ఆదాయం కల్పించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. మద్యపానీయాల కంటే ఆరోగ్యానికి హాని కలిగించని కల్లు దుకాణాల ప్రారంభం సాధ్యమేనా అన్న దానిపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఈవీకేఎస్ తెలిపారు.

ఉత్సాహంగా అవగాహన మారథాన్

ప్యారీస్, జూన్ 29: ఐదేళ్లలోపు చిన్నారుల్లో జ్ఞాపకశక్తి మెరుగుపర్చేలా అరస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం బీసెంట్ నగర్ బీచ్‌లో నిర్వహించిన అవగాహన మారథాన్‌ను లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించారు. ఉదయం 5.30 నుంచి 7.30 గంటల వరకు సాగిన ఈ మారథాన్‌లో చిన్నారులు సహా 200 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. మారథాన్‌లో భాగంగా 'సే నో టూ స్క్రీన్ టైం సేవ్ యంగ్ మైండ్స్' అనే శీర్షికతో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సంస్థ నిర్వాహకులు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.



కోవై ప్రభుత్వాసుపత్రికి వైద్య ఉపకరణాలు అందజేత

అడయార్, జూన్ 29: కోయంబత్తూరు మెట్రోపాలిటన్ రౌండ్ టేబుల్ 62, కోయంబత్తూరు మెట్రోపాలిటన్ లేడీస్ సర్కిల్-23 సంయుక్తంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుని, కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్‌ఈఏఎల్ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసి, కీలక వైద్య ఉపకరణాలను ప్రదానం చేశాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు సంస్థలు కలిసి నియోనేటల్ వార్డుకు అవసరమైన మందులు, పరికరాలను సమకూర్చాయి. తద్వారా నవజాత శిశువులకు, తల్లిదండ్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడనుంది. ఇందులో హాట్ అండ్ కోల్డ్ వాటర్‌ను అందించేలా స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ ప్యూరిఫయర్‌ను అమర్చారు. దీని విలువ రూ.61,360. అలాగే, రూ.1,41,000 కలిగిన అమెడ బ్రెస్ట్ పంప్ కిట్‌ను అందించినట్టు ఆ రెండు సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నాయి.



సంపూర్ణ మద్యనిషేధం అసాధ్యం

మంత్రి ముత్తుస్వామి

ప్యారీస్, జూన్ 29: రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, పరిస్థితులు అనుకూలంగా లేవని ఎక్సైజ్ శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామి పేర్కొన్నారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన బిల్లును మంత్రి ముత్తుస్వామి ప్రవేశపెట్టి, అందులోని సారాంశాన్ని సభకు వివరించారు. రాష్ట్ర ఎక్సైజ్ చట్టం 1937ను సవరించే విధంగా దాఖలుచేసిన బిల్లు ప్రకారం, రాష్ట్రంలో సారా తయారుచేసి విక్రయిస్తూ పట్టుబడే వారికి యావజ్జీవ జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, ఈ నేరస్తులకు సంబంధించిన స్థిరచరాస్తులను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధ చట్టాన్ని అమలుపరచాలంటూ అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయని అయితే, దీనిని వెంటనే అమలుపరిచేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవన్నారు. అయితే, ప్రభుత్వం తరపున నిర్వహించిన టాస్మాక్ మద్యం దుకాణాల సంఖ్య దశలవారీగా తగ్గిస్తున్నప్పటికీ, మందుబాబుల సంఖ్య మాత్రం ఇంకా పెరుగుతూనే ఉందని మంత్రి తెలిపారు.

చేతకాకుంటే తప్పుకోండి : పీఎంకే

తమిళనాట సంపూర్ణ మద్యనిషేధ చట్టం అమలు పరిచేందుకు సాధ్యపడకుంటే తప్పుకోవాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న టాస్మాక్ దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యపానీయాల ధర అధికంగా ఉన్నందువల్లే రోజంతా కష్టపడి చేస్తున్న శ్రామికులు తక్కువ ధరకు అందుబాటులో ఉన్న సారా వెతుక్కుంటూ వెళుతున్నారని తెలిపారు. అసెంబ్లీలో ఎక్సైజ్ శాఖ మంత్రి ముత్తుస్వామి మద్య నిషేధంపై తెలియజేసిన అభిప్రాయాలు దిగ్భ్రాంతి కలిగించాయని అన్బుమణి పేర్కొన్నారు.

తమిళిసైకి జాతీయ స్థాయి పదవి?



చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధిష్ఠానం ఆదేశాలను శిరసావహించి రెండు రాష్ట్రాల గవర్నర్ పదవిని వదలుకుని లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు జాతీయ స్థాయి పదవి వరించనుంది. ప్రస్తుతం కేంద్రంలో మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మునుపటిలా స్వీయ మెజార్టీతో కాకుండా మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని నడపాల్సి వచ్చినందుకు గల కారణాలపై బీజేపీ అధిష్ఠానం సమీక్షిస్తోంది. ముఖ్యంగా తమిళనాట పార్టీ ఘోర పరాజయానికి గల కారణాలపై కూడా చర్చలు సాగిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ తక్కువ సీట్లలో గెలిచిన రాష్ట్రాలు, ఘోర పరాజయాన్ని చవిచూసిన రాష్ట్రాలకు సంబంధించి పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జులను మార్చేందుకు వ్యూహరచనలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులలో రెండు రోజులకు ముందు తమిళిసై ఢిల్లీ వెళ్ళి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మర్యాదపూర్వకంగా కలవడం కలకలం సృష్టించింది. తమిళిసైకి జాతీయ స్థాయి పదవినిచ్చే విషయంగా అమిత్‌షా ఆమెతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ వ్యవహారాల్లో ముమ్మరంగా పాల్గొంటున్న తమిళిసై జాతీయ స్థాయి పార్టీ పదవి కోసం పావులు కదుపుతున్నట్లు చెబుతున్నారు. అయితే అధిష్ఠానం తమిళిసైకి పార్టీ పరంగా జాతీయ స్థాయి పదవిని కట్టబెడుతుందా? కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నామినేటెడ్ పోస్టు ఏదైనా అప్పగిస్తుందా? అనే విషయం ప్రస్తుతం సస్పెన్స్ కొనసాగుతోంది.

కొడనాడు కేసును ఇంటర్‌పోల్ సాయంతో విచారణ జరపాలి

● సీఎం స్టాలిన్

ప్యారీస్, జూన్ 29: నీలగిరి జిల్లాలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు సొంతమైన కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ తదితర ఘటనలకు సంబంధించిన కేసును ఇంటర్‌పోల్ సాయంతో విచారణ జరపాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర పోలీసు శాఖకు సంబంధించి కొత్త పథకాలను ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్, కొడనాడు కేసుకు సంబంధించి మాట్లాడారు. కొడనాడు కేసును రాష్ట్రప్రభుత్వం కీలకమైన కేసుగా పరిగణలోకి తీసుకుందని, ఈ కేసులో ఇప్పటి వరకు 268 సాక్షుల వద్ద విచారణ జరిపినట్లు తెలిపారు. నిందితులు ఉపయోగించిన 8 సెల్‌ఫోన్లు, నాలుగు సిమ్‌కార్డులను కోయంబత్తూర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ నుంచి 8,000 పేజీల నివేదిక పొందామని, సంఘటన జరిగిన సమయంలో కొంతమంది నిందితులకు విదేశాల నుంచి సెల్‌ఫోన్ కాల్స్ వచ్చాయన్నారు అందువల్లే ఈ కేసులో ఇంటర్‌పోల్ సాయంతో విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం తెలిపారు.

చోరీకి పాల్పడిన బీజేపీ నాయకుడి అరెస్ట్

ప్యారీస్, జూన్ 29: తిరువళ్లూర్ పరిసర ప్రాంతాల్లో రెండేళ్లుగా చోరీలకు పాల్పడిన బీజేపీ నాయకుడు ప్రభాకరన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, 85 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. ఊత్తుకోట సమీపంలో ఉన్న పెరంబూర్ పాంచాలి నగర్‌లో ఈ నెల 22వ మణికంఠన్ తన కుటుంబసభ్యులతో కలసి విహారయాత్రకు వెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభాకరన్ ఆ ఇంట్లో చొరబడి ఐదు సవర్ల నగలు, 900 గ్రాముల వెండి వస్తువులు, రూ.లక్ష నగదుతో పరారయ్యాడు. దీనిపై మణికంఠన్ ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు, తిరువళ్లూర్ పశ్చిమ జిల్లా బీజేపీ యువజన విభాగ ఉపాధ్యక్షుడు ప్రభాకరన్ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. గాలింపు చర్యలు వేగవంతం చేసి ఎట్టకేలకు ప్రభాకరన్, పూండికి చెందిన కేశవన్‌ను శుక్రవారం అరెస్ట్ చేశారు. ప్రభాకరన్ 13ఇళ్లలో చోరీకి పాల్పడి 85 సవర్ల నగ లు, లక్షలాది రూపాయలు చోరీ చేసినట్టు తెలిసింది.విచారణ అనంతరం వారి ఊత్తుకోట న్యాయస్థానంలో హాజరుపరచి పుళల్‌జైలుకు తరలించారు.

కళ్లకుర్చి కల్తీ సారా కేసు 11 మందికి పోలీసు కస్టడీ

ప్యారీస్, జూన్ 29: కళ్లకుర్చి కరుణాపురంలో కల్తీ సారా తాగిన ఘటనలో మృతుల సంఖ్య 65కు పెరిగింది. ఈ దుర్ఘటనకు సంబంధించి కళ్లకుర్చి కలెక్టర్, ఎస్పీ సహా పలువురు అధికారులు బదిలీ కాగా, మరి కొంతమందిపై సస్పెన్షన్ వేటుపడింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును సీబీసీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీబీసీఐడీ ఏడీఎస్పీ గోమతి నేతృత్వంలో జరిపిన విచారణలో... అధికంగా మెథనాల్ కలిపిన సారా తాగడం వల్లే 65 మంది మరణించినట్లు తెలిసింది. కళ్లకుర్చికి చెందిన గోవిందరాజ్ అలియాస్ కన్నుకుట్టి, ఆయన భార్య విజయ, చిన్నదురై, జోసెఫ్, మాదేష్, గౌతంచంద్, శివకుమార్, బన్సీలాల్, కదిరవన్, కన్నన్, శక్తివేల్ సహా 21 మందిని అరెస్ట్ చేశారు. కాగా, ఈ కేసులో కీలకమైన సమాచారం రాబట్టేందుకు పట్టుబడిన 21 మందిలో 11 మందిని తమ కస్టడీలోకి తీసుకొని విచారణ జరపాలని సీబీసీఐడీ పోలీసులు నిర్ణయించారు. ఇందుకోసం కళ్లకుర్చి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుందని కోర్టు వర్గాలు తెలిపాయి.

ప్రభుత్వ బస్సు ఢీకొని మహిళ మృతి

ప్యారీస్, జూన్ 29: నగరంలో పారిశుధ్య పనుల్లో పాల్గొన్న ఓ మహిళను ప్రభుత్వ బస్సు ఢీకొనడంతో మృతి చెందారు. పళ్లికరనై రేడియల్ రోడ్డులో శనివారం ఉదయం ఫాతిమా (45) రోడ్డుపై చెత్తాచెదారం తొలగిస్తుండగా వేగంగా వచ్చిన ప్రభుత్వ బస్సు ఢీకొనడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో సహ ఉద్యోగులు ఆమెను అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో ఆమె మృతిచెందింది. ఈ ఘటనపై పళ్లికరనై ట్రాఫిక్ విభాగం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో కోవై డీఎస్పీ మృతి

ప్యారీస్, జూన్ 29: కోవై డీఎస్పీ వెట్రిసెల్వన్ శనివారం గుండెపోటుతో మరణించారు. నీలగిరి జిల్లా కున్నూర్‌కి చెందిన ఆయనకు 56 ఏళ్లు. కోవై డీఎస్పీగా పదేళ్లుగా పనిచేసిన ఆయనకు నెలరోజుల క్రితం గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు సూలూరు ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. నెలరోజుల చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మూడు రోజుల క్రితం కోవై పీలమేడులో ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో వెట్రిసెల్వన్ మరణించారు. ఆయన భౌతికకాయానికి పలువురు పోలీసు అధికారులు, స్థానిక ప్రజలు అంజలి ఘటించిన అనంతరం సూలూ రు శ్మశానవాటికలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● ఒకరి అరెస్ట్

ప్యారీస్, జూన్ 29: ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన పీఈటీని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. గత విద్యా సంవత్సరం 8వ తరగతి విద్యార్థినిపై వ్యాయామ టీచర్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిసింది. తనకు జరిగిన అన్యాయంపై విద్యార్థిని హెచ్ఎం సహా మరి కొంతమంది టీచర్ల వద్ద ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవని తెలిసింది. దీనిపై ఆ విద్యార్థిని మహిళా పోలీస్‌స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం విచారణ జరిపిన పోలీసులు, పీఈటీని పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కాగా, బాధిత విద్యార్థిని ఫిర్యాదుపై చర్యలు చేపట్టని 10 మంది టీచర్లను బదిలీ చేయడంతో పాటు పదవీ విరమణ పొందనున్న హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కేపీ పార్క్ అపార్ట్‌మెంట్‌లో తెగిన లిఫ్ట్

● ఒకరి మృతి

ప్యారీస్, జూన్ 29: స్థానిక పెరంబూర్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని పులియాంతోపు కేపీపార్క్‌లో ఉన్న అపార్ట్‌మెంట్‌లో శనివారం సాయంత్రం లిఫ్ట్ తెగిపడిన ఘటనలో గణేశన్ (52) మరణించిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తమిళనాడు స్లమ్ క్లియరెన్స్ బోర్డు ఆధ్వర్యంలో పులియాంతోపు కేపీ పార్క్‌లో కొత్తగా పది అంతస్తుల అపార్ట్‌మెంట్లు నిర్మించి, లబ్ధిదారులకు అద్దెకు కేటాయించారు. ఇందులో 10వ అంతస్తులో ఉన్న తన ఇంటికి వెళ్లేందుకు గణేశన్ ఎక్కిన లిఫ్ట్ హఠాత్తుగా తెగిపడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గణేశన్ అక్కడికక్కడే మరణించాడు. లిఫ్ట్ నిర్వహణ చేపట్టకపోవడంతో పాటూ ఆపరేటర్‌ను నియమించలేదని, అందువల్ల అప్పుడప్పుడూ లిఫ్ట్ సగంలోనే ఆగిపోతుందంటూ అపార్ట్‌మెంట్ వాసులు వాపోయారు.. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




చేపను రెండుగా కోసి ఉప్పు, పసుపు దట్టించిన దృశ్యం



ఉప్పు చేపల ప్యాకింగ్

SUNDAY SPECIAL



'పట్టరై ఉప్పు చేప' రుచి... నోటితో చెప్పతరమా!

ఉప్పుచేపలు పేదరికానికి చిహ్నంగా చెబుతుంటారు. వంటకాల్లో తక్కువ ధరకు లభించేది ఉప్పు చేప. ఉప్పుచేపల్లో పోషక విలువలు అధికం. అలాగే, సులభంగా వండే మాంసాహార వంటకం ఉప్పు చేప మాత్రమే. వాటిలో ఒకరకమైనవి పట్టరై ఉప్పు చేపలు. చేపల్ని ఇసుక గుంతలో పూడ్చి, వాటిని ఉప్పుచేపలుగా మార్చి ఆన్‌లైన్ ద్వారా విక్రయిస్తున్నాడు రామేశ్వరానికి చెందిన ఆంథోని దీనా. దివ్యాంగుడైన ఆంథోని తనలాంటి దివ్యాంగులకు పట్టరై ఉప్పుచేపలు విక్రయాల్లో ఉపాధి కల్పించి వారికి జీవనోపాధి చూపుతున్నాడు.

- పెరంబూర్



గుంతలో ఉంచేందుకు సిద్ధం చేసిన చేప



పట్టరై ఉప్పుచేపలతో ఆంథోని దీనా



సంప్రదాయం... అధునాతనం

మా తండ్రి పట్టరై ఉప్పుచేపలు తయారు చేస్తుంటారు. పట్టరై ఉప్పు చేపలు ప్రస్తుతం ఎవరూ చేయడం లేదు. మా తండ్రి మాత్రమే ఈ వృత్తి కొనసాగిస్తున్నారు. తాత నుంచి నేర్చుకున్న వృత్తిని నేటికీ కూడా ఆయన చేస్తున్నాడు. ఒకప్పుడు ఉప్పు చేపలు తయారుచేసి మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించేవాడు. నేను దానికి ఆధునికత జోడించాను. చిన్నప్పటి నుంచే ఆయన ఉప్పు చేపలు చేసే పద్ధతులు గమనించాను. చేపలు ఎంపిక చేసుకోవడం, వాటిని ఉప్పుచేపలుగా తయారు చేయడం, మార్కెట్లో వాటిని విక్రయించే విధానం తదితరాలను దగ్గరుండి గమనించాను.

మా తాతల కాలం నుంచీ...

"రామేశ్వరం సమీపంలోని తంగచ్చిమఠం మా స్వగ్రామం. నేను జాలర్ల కుటుంబానికి చెందిన వాడిని. మా తాత కాలం నుంచి ఉప్పు చేపలు చేయడం వృత్తిగా వస్తోంది. తాత తర్వాత నాన్న, ప్రస్తుతం నేను ఈ వృత్తి కొనసాగిస్తున్నాం. ప్లస్‌టూ తరువాత ఉన్నత చదువులు చదివే స్తోమత లేకపోయింది. ఉద్యోగం చేద్దామని పలు ప్రాంతాలకు వెళ్లా. కానీ, నా అవయవలోపం కారణంగా ఎవరూ పనిలో చేర్చుకోలేదు. ఉద్యోగం లేదని నేరుగా చెప్పకుండా ఏదో ఒకటి చెప్పి పంపించేవారు. ఆ సమయంలో ఆ మనస్సుకు తట్టిన ఒకే విషయం ఏమిటంటే, నాలాంటి దివ్యాంగులకు ఉపాధి కల్పించాలి. ఒకరి వద్దకు వెళ్లి చేతులు కట్టుకొని నిల్చొనే బదులు నేనే స్వయంగా ఒక వృత్తి చేపట్టాలని నిర్ణయించుకున్నా. నాన్న చేసే ఉప్పుచేపల వృత్తిని ఆధునాతన విధానంలో చేపట్టాలనుకున్నాను.

అన్ని చేపలు సాధ్యం కాదు...

ఉప్పుచేపల్లో పోషకవిలువలు రెండింతలు అధికంగా ఉంటాయి. అదే సమయంలో రెండు కిలోల చేపలు ఉప్పుచేపలుగా తయారుచేస్తే లభించేది కిలో మాత్రమే. వాటిలో పట్టరై ఉప్పుచేపలు మాత్రమే పాత విధానంలో చేసే ఉప్పుచేపలు. అలా మా పూర్వీకులు ఉప్పుచేపలు చేస్తుండేవారు. వాస్తవం ఏమిటంటే ఉప్పుచేపలు తయారుచేసే ఖచ్చితమైన విధానం ఇదే. సముద్రం నుంచి చేప పట్టి తీరానికి వచ్చిన తర్వాత దానిని రెండుగా కోయాలి. అనంతరం లోపల ఉన్న వ్యర్థాలు తొలగించి శుభ్రం చేసుకోవాలి. దానిపై ఉప్పు, పసుపు పూయాలి. తర్వాత దానిని తాటాకులో పూర్తిగా మూసివేయాలి. అలా చేసిన వాటిని సముద్రతీరంలో ఇసుక గుంతలో పూడ్చివేయాలి. 10 రోజుల అనంతరం గుంతను తవ్విన వెంటనే మంచి సువాసన వస్తుంది. అదే ఉప్పుచేపల సువాసన. ఆ చేపలను తీసిన వెంటనే వంట చేసుకోవచ్చు. వాటి కూర ఎంతో రుచిగా ఉంటుంది. పట్టరై ఉప్పుచేపలను అన్ని చేపలతో చేయడం సాధ్యం కాదు. కట్టా, నెయి, కొడువా, వంజరం, తడియన్‌విలై చేపలను మాత్రమే పట్టరై ఉప్పుచేపలుగా తయారు చేయవచ్చు. ఇక, మిగిలిన చేపలను మామూలుగానే తయారుచేసుకోవచ్చు. ఇలాంటి చేపలను ఉప్పుచేపలుగా మార్చాలంటే ఒక రోజు చాలు. పసుపు రాసి ఉప్పు చల్లి కొంతసేపు ఎండలో ఉంచితే చాలు ఉప్పుచేప రెడీ.

పట్టరై... పది రోజులు

పట్టరై ఉప్పుచేపలు తయారీకి పది రోజులు పడుతుండడంతో ప్రస్తుతం ఈ విధానంలో చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అందువల్ల నేను ఈ విధానంలో చేయాలని, చేపలను ఆన్‌లైన్‌లో విక్రయించాలని నిర్ణయించుకున్నాను. అదే సమయంలో పట్టరై ఉప్పుచేపలపై యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి అవగాహన కల్పించా. ఉప్పుచేపల తయారీని చిత్రీకరించి ఈ ఛానల్‌లో అప్‌లోడ్ చేశాను. చేపల తయారీలో సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు తదితరాలు ఈ వీడియోలో వివరించాను. అలాగే, ఆర్డరు చేసిన వారికి కొరియర్ ద్వారా చేపలు డెలివరీ చేస్తుంటాను. అలా పట్టరై చేపల ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభించాను.

ప్రత్యేక ప్యాకింగ్... : ప్రస్తుతం అన్ని సేవలు ఆన్‌లైన్‌లో లభ్యమవుతుండడంతో, పలువురు సోషల్ మీడియా ద్వారా సంప్రదించి ఆర్డర్లు ఇస్తున్నారు. నేను కూడా కొరియర్ ద్వారా వారికి డెలివరీ చేస్తుంటాను. కానీ, నేను పంపించే ప్యాక్ వారికి సక్రమంగా చేరడం లేదు. ఎందుకంటే ప్యాకింగ్ చిరిగిపోవడం జరుగుతోంది. ఆహార పదార్థాలు కావడంతో డెలివరీలో కూడా జాగ్రత్తలు చేపట్టాల్సి ఉంటుంది. అందువల్ల నేను గతంలో చేసిన ప్యాకింగ్ విధానం మార్చాను. ప్యాకింగ్ చేసినప్పటి నుంచి వినియోగదారుడికి చేరే వరకు ఎలాంటి నష్టం జరుగకుండా ప్రత్యేకంగా ప్యాకింగ్ చేసే సౌకర్యం చేపట్టాను. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఆర్డర్లు వస్తున్నాయి.



గుంతలో చేపలు ఉంచుతున్న దృశ్యం

దివ్యాంగులకు ఉపాధి...

నేను ఒక్కడినే ఈ పని చేపట్టలేని కారణంగా పలువురిని ఉద్యోగంలోకి తీసుకున్నా. వారిలో దివ్యాంగులు కూడా ఉన్నారు. వారు కూడా నాలాగే ఉద్యోగం లేకుండా ఇబ్బందులు పడుతుండేవారు. ఆ బాధ ఎలాంటిదో నాకు తెలుసు. ప్రస్తుతం నా వద్ద 8 మంది పనిచేస్తుండగా, వారిలో నలుగురు మహిళలు, మిగిలిన వారు దివ్యాంగులు. ఆర్డర్లు చూసుకోవడం, దాని ప్రకారం ప్యాకింగ్ చేయడం, వినియోగదారులకు అందాయా, లేదా అని తెలుసుకోవడం వారి పని. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆన్‌లైన్‌లో పట్టరై ఉప్పుచేపలు విక్రయిస్తుండగా, తదుపరి విస్తరణలో భాగంగా విదేశాలకు కూడా ఎగుమతి చేయాలని నిర్ణయించా. పట్టరై ఉప్పుచేపలు ఒక బ్రాండ్‌గా మార్చాలి. అలాగే, మరింత మంది దివ్యాంగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పని చేస్తున్నా.

షరీఫ్ దర్శకత్వంలో 'యు ఆర్ నెక్స్ట్' ప్రారంభం



'యు ఆర్ నెక్స్ట్' షూటింగ్ ప్రారంభ పూజా దృశ్యం

ఐ మ్యాక్ ఫిలిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, స్కై ఫ్రేం ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై నిర్మాతలు మొహిదీన్ అబ్దుల్ ఖాదర్, మణి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రానికి 'యు ఆర్ నెక్స్ట్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఎండీ షరీఫ్ ఈ చిత్రానికి కథను సమకూర్చి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమం సాలిగ్రామంలోని ప్రసాద్ ల్యాబ్‌లో తాజాగా జరిగింది. కేఎస్ రవికుమార్, రచిత మహాలక్ష్మి, ఉదయ, జనని, దినేష్, దివ్య కృష్ణన్, అర్షద్, కేపీవై వినోద్, బుల్లెట్ సామి నటిస్తున్నారు. కేజీ రతీష సినిమాటోగ్రఫీ. 'ఇసైపేట్టై' వసంత్ సంగీతం సమకూర్చుతున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ... 'ఐటీ రంగంలో ఉండే యువతను చుట్టుముట్టే సమస్యలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని హర్రర్ మూవీగా తెరకెక్కిస్తున్నాం. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో నిర్మించి పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేస్తాం. ఈ సినిమా స్క్రిప్టుపై మాకు ఎంతో నమ్మకం ఉంది. భారతీయ సినీ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని బలంగా నమ్ముతున్నా' అన్నారు. సీనియర్ దర్శక నటుడు కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ... 'ఈ సినిమా స్క్రిప్టు చాలా బలంగా ఉంది. వైవిధ్యభరితమైన కథాంశంతో దర్శకుడు ముందుకు వస్తున్నారు. ఇందులో నన్ను యంగ్‌గా చూపిస్తానని చెప్పారు. నా లుక్ ఎలా ఉంటుందో నన్న ఆసక్తి నెలకొంది. నిర్మాతలకు చిత్రపరిశ్రమ కొత్తది అయినప్పటికీ సినిమాపై ప్రేమ, ఫ్యాషన్ వారిని ఇక్కడకు తీసుకొచ్చింది. ఈ చిత్రం ఘన విజయం సాధించి మరిన్ని చిత్రాలు నిర్మించాలని ఆకాంక్షిస్తున్నా' అని పేర్కొన్నారు. నటి దివ్య కృష్ణన్ మాట్లాడుతూ... 'ఈ ప్రాజెక్టులో నన్ను భాగస్వామిని చేసిన దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు. కేఎస్ రవికుమార్ వంటి దర్శకుడితో కలిసి పనిచేసేందుకు అమితాసక్తితో ఎదురు చూస్తున్నా' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి



ఆగస్టులో వస్తున్న 'అందగన్'

చాలాకాలం తర్వాత ప్రశాంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అందగన్'. దర్శకత్వం త్యాగరాజన్. ఆగస్టులో విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు. అయితే, విడుదల తేదీపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. హిందీలో ఘన విజయం సాధించిన 'అంధధూన్' చిత్రాన్ని ప్రశాంత్ తండ్రి, సీనియర్ నటుడు త్యాగరాజన్ తన సొంత నిర్మాణ సంస్థ స్టార్ మూవీస్ పతాకంపై తమిళంలోకి రీమేక్ చేశారు. ఇందులో ఆయుష్మాన్ ఖురానా పాత్రను ప్రశాంత్ పోషించారు. ప్రియా ఆనంద్ హీరోయిన్. ఇతర పాత్రలను సిమ్రాన్, కార్తీక్, యోగిబాబు, ఊర్వశి, కేఎస్ రవికుమార్, మనోబాలా, వనిత విజయకుమార్, సెమ్మలర్, పూవైయార్ తదితరులు నటించారు. రవియాదవ్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం సమకూర్చారు. ఈ సినిమా షూటింగ్ 2021 జూన్‌లోనే పూర్తయింది. కానీ, పలు కారణాలతో ఈ సినిమా విడుదలలో తీవ్ర జాప్యం నెలకొంది. సంక్రాంతికి ఈ చిత్రం పోస్టర్‌ను విడుదల చేయగా, ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ సినిమాను ఆగస్టులో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. కాగా, అగ్రహీరో విజయ్ నటించిన 'ది గోట్' చిత్రంలో ప్రశాంత్ ఓ ముఖ్య పాత్రను పోషించగా ఈ చిత్రం సెప్టెంబరులో విడుదల కానుంది.

మా ఇంట శుభకార్యం... రా.. రండి

- ప్రధాని మోదీకి శరత్‌కుమార్ ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న రాధికా శరత్ కుమార్ తదిరులు

ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సినీ నటుడు, బీజేపీ నేత శరత్‌కుమార్, ఆయన సతీమణి, సినీ నటి రాధికా తమ కుమార్తె వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. శుక్రవారం సాయంత్రం ప్రధాని మోదీని ఢిల్లీలోని ఆయన నివాసంలో కలుసుకుని పెళ్లిపత్రికను అందజేశారు. ఆ సమమంలో పెళ్లి కుమార్తె, నటి, వరలక్ష్మి శరత్‌కుమార్, కాబోయే వరుడు నికోలాయ్ సచ్‌దేవ్ కూడా ఉన్నారు. ముంబైకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అయిన సచ్‌దేవ్‌ను వరలక్ష్మి ప్రేమించి పెళ్లి చేసుకోనున్నారు.ఈ నేపథ్యంలో పెళ్ళి ఆహ్వాన పత్రిలకు సినీ రాజకీయ దంపతులకు రాధికా శరత్ కుమార్ స్వయంగా అందజేస్తున్నారు. ఇప్పటికే అగ్ర నటులు రజనీకాంత్, కమల హాసన్, బాలకృష్ణ వంటి వారికి అందజేశారు. తాజాగా ప్రధాని మోదీకి వివాహ ఆహ్వాన పత్రికను అందించారు.

'బెంజ్'లో ఎస్‌జే సూర్య, ఫహద్ ఫాజిల్?



రాఘవ లారెన్స్, ఎస్‌జే సూర్య, ఫహద్ ఫాజిల్

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ సొంత నిర్మాణ సంస్థ 'జి స్క్వేర్' బ్యానరుపై రాఘవ లారెన్స్ హీరోగా నిర్మిస్తున్న చిత్రం 'బెంజ్'. ఇందులో సీనియర్ నటులు ఎస్‌జే సూర్య, ఫహద్ ఫాజిల్ ఆన్‌బోర్డులోకి తీసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'రెమో', 'సుల్తాన్' వంటి హిట్ చిత్రాలను రూపొందించిన భాగ్యరాజ్ కన్నన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కథ డిమాండ్ మేరకు ఈ ఇద్దరు అగ్రనటులను తీసుకున్నట్టు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. కాగా, 'మా నగరం', 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ చిత్రాలను రూపొందించిన యంగ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్... జి స్క్వేర్ పేరుతో సొంతంగా నిర్మాణ సంస్థను ప్రారంభించి తొలి చిత్రంగా 'ఫైట్ క్లబ్'ను తెరకెక్కించారు. అలా నిర్మాతగా మారిన లోకేష్. తన బ్యానరుపై రెండో చిత్రంగా 'బెంజ్' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇదిలా ఉండగా సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను 'కూలీ' చిత్రంలో డైరెక్ట్ చేస్తున్న విషయం తెల్సిందే.



సేలం పెరియార్ వర్సిటీ వీసీ ఆర్ జగన్నాధన్‌కు సర్వీసు పొడిగింపు ఉత్తర్వును అందజేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.

సేలం పెరియార్ వర్శిటీ వీసీ పదవీకాలం పొడిగింపు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సేలంలోని 'పెరియార్' విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఆర్.జగన్నాథన్ పదవీ కాలాన్ని మరో యేడాదిపాటు పొడిగిస్తూ రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు రాజ్‌భవన్‌లో జగన్నాధన్‌కు సర్వీసు పొడిగింపు ఉత్తర్వులను ఆయన అందజేశారు. వీసీపై పలు అవినీతి అక్రమాలకు సంబంధించి పలు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయన పదవీ కాలం పొడిగించకుండా తగు చర్యలు చేపడతానంటూ ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి అసెంబ్లీలో ప్రకటించారు. అటుపిమ్మట జగన్నాథన్‌కు వ్యతిరేకంగా విశ్వవిద్యాలయంలో నిరసన ప్రదర్శనలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో జగన్నాథన్ పదవీకాలాన్ని వచ్చే యేడాది మే 19 వరకు గవర్నర్ పొడిగించడం తీవ్ర కలకలం సృష్టించింది.

కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో

క్యాన్సర్ అవగాహన పరుగులు

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సహకారంలో శనివారం ఉదయం క్యాన్సర్‌పై అవగాహన పరుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ "మారథాన్‌లో టీసీఎస్‌లో పనిచేస్తున్న ఐదువేల మందికిపైగా ఉద్యోగులు పాల్గొన్నారు. సిరుచేరి టీసీఎస్ ప్రాంగణం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో టీసీఎస్ చెన్నై రీజియన్ హెడ్ సురేష్ రామన్, కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్, మెడికల్ సూపరింటెండెంట్ మహేష్‌కుమార్, డాక్టర్లు శివరామ్ కన్నన్, కె.మహాలక్ష్మి, సుజయ్‌సుశికర్, సురేష్‌కుమార్, అశ్విన్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



క్యాన్సర్ అవగాహన పరుగుల కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కావేరి హాస్పిటల్ వైద్యనిపుణులు

కులగణనపై తప్పుడు సమాచారం?

నిరసనగా పీఎంకే సభ్యుల వాకౌట్

చెన్నై, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో కులగణనకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు తప్పుడు సమాచారమిచ్చారని, ఆ వివరాలను సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ పీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. ఆ తర్వాత పీఎంకే సభాపక్ష నాయకుడు జీకే మణి మీడియాతో మాట్లాడుతూ శాసనసభలో రిజర్వేషన్లకు సంబంధించి ప్రస్తావిస్తూ కులగణన జరిపే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని, బిహార్‌లో ఆ రాష్ట్ర ప్రభుత్వం కులగణను రద్దు చేసిందని ముఖ్యమంత్రి స్టాలిన్ మంత్రులు సభకు తప్పుడు సమాచారమిచ్చారని పేర్కొన్నారు. పట్నా హైకోర్టు కులగణన నిర్వహణను వ్యతిరేకించలేదని, రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు చేయాలన్న ప్రతిపాదనలను మాత్రమే వ్యతిరేకించిందన్నారు. ఈ విషయాలను తాము శాసనసభలో ప్రస్తావించి తప్పుడు సమాచారాన్ని సభ రికార్డుల నుండి తొలగించాలని కోరామన్నారు. ఇక వన్నియార్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్లపై సమగ్రమైన వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని జీకే మణి డిమాండ్ చేశారు. వన్నియార్లకు 10.5 శాతం రిజర్వేషన్లకు సంబంధించి మంత్రులు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ ఆ రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదనే రీతిలోనే శాసనసభలో ప్రసంగించడం గర్హనీయమన్నారు.



అసెంబ్లీ నుంచి వెలుపలకు వస్తున్న పీఎంకే శాసనసభ్యులు

అంబత్తూర్ కన్యకా పరమేశ్వరి ఆలయంలో

యాగశాల పూజలు ప్రారంభం

ప్యారీస్, జూన్ 29: శ్రీ కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక అంబత్తూర్‌లో కొత్తగా నిర్మించిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ అష్టబంధన మహాకుంభాభిషేకం సోమవారం జరగనుంది. ఈ సందర్భంగా శనివారం నుంచి యాగశాల పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు శాస్త్రోక్తంగా జాము కాల పూజలను నిర్వహించారు. ఈ ఆలయ ప్రాంగణంలో విఘ్నేశ్వరుడు, వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, సాయిబాబ సన్నిధులతో పాటు కన్యకా పరమేశ్వరి గర్భగుడులకు 1వ తేది ఉదయం 6 నుంచి 7 గంటల్లోపు శుభలగ్నంలో మహాకుంభాభిషేకం జరగనుంది. ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మెన్ అజంతా డా.కనిగెలుపుల శంకరరావు, ట్రస్ట్ నిర్వాహకులు, ఆలయ నిర్వాహకులు యాగశాల పూజలో పాల్గొన్నారు.



యాగశాల పూజలు నిర్వహిస్తున్న నిర్వాహకులు